# నడుస్తున్న చరిత్ర



ఎలక్ట్రాన్

మొరిగే కుక్కలు కరవ్వు. సమస్తకోటి జీవరాసులకీ అంతో ఇంతో మెదడుంది. ఆలోచించే శక్తి ఉంది. అరిచే సాధనం ఉంది. మనిషికి పుట్టుకతో మాటరావడంతో, ప్రపంచాన్నంతటినీ మసి పూసి మారేడుకాయ చేసి పారేశాడు. తనలో ఉన్న బలహీనతలని జంతుజాలం మీద పెట్టి ఆనందించడం మనిషి [illegible] అందుకనే, ''మొరిగే కుక్కలు కరవ్వు' అంటే, మాట్లాడే మనిషి పనిచెయ్యడూ అని. ఆడొక్కటే కాదు, కాలు కదపని మనిషి, కాలు నిలవని మనిషి కూడా పని చెయ్యరు.

చెట్టుని అల్లుకు పోయిన లతని గురించి కవులంతో అందంగా వర్ణిస్తారు. కాని ఆ ధారభూతమైన చెట్టుని గురించి రాసేవాడూ, చదివేవాడూ తలచనైనా తలచరు. వాళ్ళ కనబడేది ఆ లత అంద మొక్కటే. ఎదుటి వాడి శక్తి సామర్థ్యాల మీద ఆధారపడి, ఆతగాడి చుట్టూ తెరవేసి, లోకం దృష్టిలో గొప్పవాడిగా పేరు పొందడ మనేది లౌక్యం. కాని ఇది పచ్చి స్వార్థం. ఎదుటి వాళ్ళ సమాధుల మీద పునాదులు వేసుకోవడం వీళ్ళకి అతి సాధారణమైన అలవాటు. 'పారసైట్స్' అనేవి నక్కజాతికొక్కటికే సంబంధించినవి కావు. పని దొంగలందరూ ఈ కోవకి చెందినవారే!

మా పొరుగింటి చలమయ్య సరిగ్గా ఇటువంటి వాడే. చైనా వాళ్ళే నమ్ముకొని ఊబిలో దిగబడ్డ మన పాలకుల్ని ఉద్దేశిస్తూ, ఒక తలనెరిసిన పెద్ద మనిషి అన్నాడు—'నీ పొరుగు దేశం వాళ్ళు నీతో మైత్రిగా ఉంటా రనుకోవడం కంటే భ్రమ మరొహటి లేదు! వాళ్ళ నెప్పుడూ శత్రువులుగా చూసుకొంటేనే, నీ జాగ్రత్తలో నీవ్వుండడం జరుగుతుంది!' అని. ఇది దేశాలకే కాదు, వ్యక్తులకు సంబంధించినది కూడా. చలమయ్య మా పక్కింటి వాడు కదా అని అక్కసుగా నేనీ మాట లనడం లేదు. మా ఆఫీసులో నా పక్క కుర్చీలో కూర్చుని, మా అందరి నెత్తిమీదా శటగోపం పెట్టిన అతగాడి ప్రయోజకత్వానికి జోహార్లు చెప్పుకుంటున్నాను.

అన్నం ఉడికిందో లేదో తెలియడానికి అంతా కెలికి చూడ నక్కరలేదు. ఇన్ని మెతుకులు పట్టి చూస్తే చాలు. మనిషి నైజం తెలుసుకోడానికి జీవిత చరిత్రనంతా తిరగతోడ నక్కర్లేదు. రెండు మూడు సంఘటనలు పరిశీలిస్తే చాలు.

సమయానికి ఆఫీసుకి రావడమనేది ఆఫీసర్ల నెత్తిమీద కిరీటం పెట్టడానికే కాని, ఆఫీసు పేరు కీ పురోగతికీ కాదని చలమయ్య విశ్వాసం. అలా సమయానికి ఆఫీసుకి వెళ్ళడం జరుగుతోందంటే, ఆ ఆఫీసరు తన క్రింది వారి మీద జులుం చెలాయిస్తున్నట్టు లెఖ్ఖ. సమయానికి ఆఫీసుకి వెళ్ళేవాడి గౌరవాని కిది భంగం. చలమయ్య దృష్టిలో పై వాడికి సలాం కొట్టడం అంటే చాలా ఘోరమైన అపరాధం. సకాలంలో పని పూర్తి చెయ్యడం అంటే అధికార వర్గానికి దాసోహం అంటూ, వాళ్ళ కింద బానిసలుగా ఉండడమేనని అతగాడి అభిప్రాయం ఇలాంటి ఉపన్యాసాలు దంచడంలో అతను చాలా దిట్ట. అయితే ఇంత ధైర్యంగా కబుర్లు చెప్పే చలమయ్య, తన ప్రవర్తనకి, ముందే పునాదులు వేసుకొనే లౌకికుడు.

ఏ రోజూనా చలమయ్య సమయానికి ఆఫీసుకి రాడు. 'ఎందుకాలశ్యంగా వస్తున్నావు?' అని అడగడానికి మాకు అధికారం లేదు. అధికారులకి దమ్ములేవు! మనిషి, అన్న తర్వాత ఏవో బలహీనతలుంటాయి. ఎదుటి వారితోలో ఉన్న బలహీనతలు, చలమయ్యకు పెద్ద సాధనాలు. ఒక్కొక్కప్పుడు మనిషి ఎంత పెద్దవాడైనా, గొప్పవాడైనా, ఎదుటి వారి మంచి సహాయం పొందవలసిన అవసరం వస్తుంది. మా ఆఫీసుకి మరో ప్రాంతంనుంచి బదిలీ అయి ఒక కొత్త డైరెక్టరు వచ్చాడు. రావడంతో ఆయన గారికి ఇల్లూ, పిల్లలకి స్కూళ్ళలో సీట్లూ కావల్సి వచ్చాయి. తనకీ, డైరెక్టరుకీ మధ్య చాలా మెట్లున్నా, చలమయ్య ఆయన దగ్గరకు వెళ్ళి, ఆ రెండు సదుపాయాలూ ఆయనకి కలగ చేశాడు. చలమయ్యద్వారా పొందిన ఈ సహాయం డైరెక్టరు నోరు శాశ్వతంగా మూత పడేటట్లు చేసింది.

రాజుగారికి తల మర్దన చేసే మంగలి మంత్రి కంటే సన్నిహితుడు. మంత్రిగారు ఆ మంగలిచేత క్షవరం చేయించుకొంటున్నప్పుడు, వాడి అజాగ్రత వల్లా, నిర్లక్ష్యం వల్లా గాట్లుపెట్టించుకొన్నా, వాణ్ణే ఏమీ అనడానికి వీల్లేదు! ఎందుకంటే, వాడు రాజుగారి మంగలి!

ఆఫ్రికా లోని ఒక చిన్న దేశం తాలూకు ప్రతినిధి వర్గం మన దేశం రావడం జరిగింది. ఏవో ఒప్పందాలు

